క్లుప్తంగా

ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కారం



వినతులు స్వీకరిస్తున్న ఇన్‌చార్జి జెడ్సీ మత్స్యరాజు

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్–5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి మూడు వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని ఇన్‌చార్జి జోనల్ కమిషనర్ మత్స్యరాజు స్వీకరించి ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. టౌన్ ప్లానింగ్‌కు 02, ఇంజినీరింగ్ విభాగానికి 01 చొప్పున అర్జీలు అందినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ ఈఈ మత్స్యరాజు, ఏసీపీ వెంకటరావు, ఆర్‌వో రాజ్యలక్ష్మి, పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, ఏపీడీలు పద్మావతి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

మహిళా కళాశాల విద్యార్థినులకు అవగాహన



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ మంజుల

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నూతనంగా చేరిన విద్యార్థినులకు ఇండక్షన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాలలో మౌలిక సదుపాయాలు, విద్యా బోధన, పాఠ్య ప్రణాళికతో పాటు సహపాఠ్య ప్రణాళిక గూర్చి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ మంజుల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ఏజీవో డాక్టర్ పి.శరణ్య, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ బి.అనూష, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డి.అరుణపద్మ, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో యువత భవిష్యత్ ప్రశ్నార్థకం



సదస్సులో మాట్లాడుతున్న ఏసీపీ అన్నెపు నర్సింహమూర్తి

డాబాగార్డెన్స్: యువత భవిష్యత్ ప్రమాదంలో ఉందని అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ అన్నెపు నర్సింహమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.కామేశ్వరరావు అధ్యక్షతన 'మాదక ద్రవ్యాల వినియోగం– విష సంస్కృతి, ప్రమాదంలో యువత భవిష్యత్' అనే అంశంపై సోమవారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సదస్సు నిర్వహించారు. మాదక ద్రవ్యాలు సేవించే వారి కుటుంబ సభ్యుల ఆవేదనను కామేశ్వరరావు వివరించారు. ప్రముఖ మానసిక వైద్యుడు డాక్టర్ ఎస్ఎస్ రాజు మాట్లాడుతూ మాదక ద్రవ్యాలను యువత ఏ విధంగా అలవాటు చేసుకుంటున్నారో వివరించారు. డాక్టర్ వీఎస్ కృష్ణా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయబాబు తదితరులు మాట్లాడారు.

దోషులను కఠినంగా శిక్షించాలి



మహాత్మాగాంధీ విగ్రహం వద్ద కళ్లకు నల్ల రిబ్బను కట్టుకుని నిరసన తెలుపుతున్న కార్పొరేటర్ నాగరాజు

సీతమ్మధార : మెడికో హత్య కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని 32వ కార్పొరేటర్ కందుల నాగరాజు డిమాండ్ చేశారు. మెడికో కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద వైద్యుల దీక్షలకు ఆయన సంఘీభావం తెలిపారు. కళ్లకు నల్ల రిబ్బను కట్టుకుని నిరసనలో పాల్గొన్నారు.



వేంకటేశ్వరస్వామి రూపంలో..



వివిధ రూపాల్లో గణనాథులు

మట్టి వినాయకుడు వస్తున్నాడు..

- ఊపందుకున్న వినాయక విగ్రహాల తయారీ
- పర్యావరణ పరిరక్షణకు మేము సైతం అంటున్న కళాకారులు



గరుడపక్షిపై కొలువు దీరుతున్న గణపయ్య



శ్రీకృష్ణుడిగా..

డాబాగార్డెన్స్: పార్వతిదేవి పసుపు ముద్ద చేసి వినాయకుడికి జీవం పోస్తే వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు తమ నైపుణ్యంతో అద్భుతమైన గణేష్ విగ్రహాలను తీర్చిదిద్దుతున్నారు. వినాయక చవితి సమీపిస్తున్న వేళ నగరంలో మట్టి పరిమళాలు గుబాళిస్తున్నాయి. పర్యావరణానికి అంతులేని హాని కలిగించే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల కంటే చూడముచ్చటైన మట్టి ప్రతిమల తయారీలో కళాకారులు నిమగ్నమయ్యారు.వీధి వీధిన బొజ్జ గణపయ్యలను పెట్టి పూజలు చేసేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. వచ్చే నెల 7 నుంచి ప్రారంభం కానున్న వినాయక నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని నగరంలో ఇప్పటి నుంచే సందడి నెలకొంది. కళాకారులు వివిధ కళాకృతుల్లో గణపతి ప్రతిరూపాలను తయారు చేసే పనిలో నిమగ్నమయ్యారు. జనాలు వారికి కావల్సిన ఆకృతుల్లో ముందుగానే ఆర్డర్లు ఇచ్చి మరీ తయారు చేయించుకుంటున్నారు. మరో వైపు మట్టి విగ్రహాలనే పూజించాలని పర్యావరణ వేత్తలు ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణకు మేము సైతం..

వాతావరణం కలుషితం కాకుండా పర్యావరణ పరిరక్షణకు మేము సైతం అంటున్నారు విగ్రహ తయారీదారులు. కోల్‌కతా, ఒడిశా, భద్రకు నుంచి వలస వచ్చిన కొంత మంది కళాకారులు నగరంలోని మధురవాడ(ఎస్‌బీఐ బ్యాంక్ పక్కన), పాతనగరంలోనూ, కంచరపాలెం, ధర్మానగర్, రామ్మూర్తిపంతులుపేట, పాతపోస్టాఫీస్ తదితర ప్రాంతాల్లో మట్టి విగ్రహాలు మాత్రమే తయారు చేస్తున్నారు. అంతేకాదు రసాయనాలు లేని సహజ రంగులను మాత్రమే ఉపయోగిస్తూ, భక్తులను ఆకర్షించే విధంగా తయారీలో నిమగ్నమయ్యారు. వినాయక విగ్రహాల తయారీలో వైట్ సిమెంట్ అచ్చుల్లో వేసి తయారు చేస్తారు. వీరు చేతితోనే వివిధ ఆకారాలతో మట్టి విగ్రహాలను తయారు చేయడం విశేషం.

కార్తీక్ బొమ్మలకు భలే గిరాకీ

ఒడిస్సా భద్రక్‌కు చెందిన కళాకారుడు కార్తీక్ నగరవాసులు సుపరిచితుడు. అతని తీర్చిదిద్దిన వినాయక ప్రతిమలను మంచి గిరాకి. ఆర్డర్లు బట్టి మూడు అడుగుల నుంచి 20,30,40,50 అడుగుల పైబడే విగ్రహాలు వివిధ రూపాల్లో చేస్తుంటాడు. నాలుగు దశాబ్దాలుగా కార్తీక్ తీర్చిదిద్దిన గణనాథుల విగ్రహాలు విశాఖవాసులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. గణపతిని విశ్వేశ్వరుడు..పరమశివుడు..పార్వతీ పారమేశ్వరుల తనయుడిగా తీర్చిదిద్దడమే గాక పలు దేవుళ్లు..దేవతా రూపాల్లో గణనాథుడ్ని తీర్చిదిద్దడంలో కార్తీక్ దిట్ట. రెండు నెలల ముందుగానే వినాయక విగ్రహానికి ఒప్పందం కుదుర్చుకోవాలి. కార్తీక తయారు చేసే బొమ్మలకు అంత డిమాండ్ ఉంటుంది.



సిద్ధమవుతున్న భారీ గణనాథులు

మట్టి విగ్రహాలే కోరుకుంటున్నారు



భక్తులు మట్టి విగ్రహాలనే కోరుకుంటున్నారు. అయితే వీటి తయారీకి చాలా సమయం పడుతుంది. ఇప్పటికే తయారు చేసిన విగ్రహాల్లో 70 నుంచి 80 శాతం ఆర్డర్లు వచ్చాయి. చిన్ననాటి నుంచి విగ్రహాల తయారీలో శిక్షణ పొందాం. పండగ సమయాల్లో కుటుంబాన్ని నెలలు విడిచి వినాయక విగ్రహాలు తయారు చేస్తాం. గణపతి బొమ్మలకు పెట్టిన పెట్టుబడి వస్తుందో రాదో తెలీయదు. ముడిసరుకుల కొనుగోలుకు అప్పులు చేసి పెట్టాం. మూడు నెలలు ముందుగానే ఒడిస్సా భద్రక్ నుంచి కళాకారులను రప్పించి వారికి మూడు పూట్ల భోజనం పెట్టి, వారి కుటుంబాలకు ఎంతో కొంత డబ్బులిచ్చి పంపాలి. తయారు చేసిన బొమ్మలన్నీ విక్రయమైతే ఆ వచ్చే ఆదాయంతోనే ఏడాది పొడవునా బతుకుతాం.

– కార్తీక్, కళాకారుడు, భద్రక్

ఏడాదిలో ఈ 3 నెలలే..



ఏడాదిలో ఈ 3 నెలలే (జూన్, జూలై, ఆగస్టు) మాకు ఆధారం. భద్రక్ నుంచి ఇక్కడకు కిరాయికి వచ్చి బొమ్మలు తయారు చేస్తున్నాం. 15 ఏళ్లుగా విశాఖ వస్తున్నాం. బొమ్మలు తయారు చేసి వెళ్తున్నాం. ఆ వచ్చిన డబ్బులతోనే ఏడాది పొడవునా జీవనం సాగిస్తాం. అక్కడ మాకు పనులు దొరకవు. వినాయక విగ్రహాల తయారీ తర్వాత వీలైతే దసరా కూడా అమ్మవారి బొమ్మలు తయారు చేస్తుంటాం.

– నారాయణ్, బొమ్మల తయారీదారుడు, భద్రక్



వైద్యుడు కోసం ఎదురుచూస్తున్న వృద్ధుడు



వెలవెలబోయిన కేజీహెచ్ ఓపీ

కొనసాగుతున్న వైద్యుల ఆందోళన

మహారాణిపేట: కేజీహెచ్‌లో జూనియర్ వైద్యుల ఆందోళన కొనసాగుతోంది. ఆంధ్రా మెడికల్ కాలేజీ నుంచి కేజీహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయం వరకు సోమవారం ర్యాలీ నిర్వహించి.. కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. కాగా.. జూనియర్ వైద్యుల ఆందోళనతో కేజీహెచ్‌కు రోగుల సంఖ్య తగ్గుముఖం పట్టింది. వచ్చిన రోగులకు వైద్య సేవలందించేందుకు సూపరింటెండెంట్ పి.శివానంద్ ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారు. 1,407 మందికి ఓపీ సేవలందించామన్నారు. 26 మేజర్, 9 మైనర్ సర్జరీలు చేసినట్లు తెలిపారు. నిరసనలో జూనియర్ వైద్యుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ టి.పృథ్వీరాజ్, ఉపాధ్యక్షురాలు ఆర్.ఊహ, కార్యదర్శి వివేక్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ సంయుక్త తదితరులు పాల్గొన్నారు.

నర్సుల నిరసన ప్రదర్శన

మహారాణిపేట: వైద్యురాలిపై జరిగిన లైంగిక దాడి, హత్యకు నిరసనగా సోమవారం ప్రైవేట్ నర్సింగ్ కళాశాల విద్యార్థులు, నర్సులు బీచ్‌రోడ్డులో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు, నర్సుల సంఘం ప్రతినిధులు భవాని, వరలక్ష్మి, బి.భాగ్యలక్ష్మి, ప్రైవేట్ నర్సింగ్ స్కూల్స్ అండ్ కాలేజీ మేనేజ్‌మెంట్ అధ్యక్షురాలు సునీత రెడ్డి, కార్యదర్శి సునీల్ పాల్గొన్నారు.



బీచ్‌రోడ్డులో ప్రదర్శన చేస్తున్న ప్రైవేట్ కాలేజీల నర్సులు

ఆర్టీసీ బస్సులో జీవీఎంసీకి మేయర్

డాబాగార్డెన్స్: వారంలో ఒక్కరోజు ప్రజా రవాణా వినియోగించడం ద్వారా విశాఖ నగర కాలుష్యాన్ని అరికట్టవచ్చని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. ఆమె తమ క్యాంపు కార్యాలయం నుంచి సోమవారం జీవీఎంసీకి ఆర్టీసీ బస్సులో చేరుకున్నారు. అనంతరం జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా పరిష్కార వేదికలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరిగిపోతున్న దృష్ట్యా జీవీఎంసీ యంత్రాంగం వారంలో ఒక రోజు ప్రజా రవాణాను వినియోగిస్తున్నామన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక అనంతరం మేయర్ తిరిగి ఆర్టీసీ బస్సులో బంగ్లాకు వెళ్లారు. జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ బ్యాటరీ వాహనంలో జీవీఎంసీ కి చేరుకున్నారు.



ఆర్టీసీ బస్సులో మేయర్ హరి వెంకటకుమారి

15వ రోజుకు శ్రావణలక్ష్మి పూజలు

డాబాగార్డెన్స్: శ్రావణమాసం పురస్కరించుకొని కనకమహాలక్ష్మి దేవస్థానంలో నిర్వహిస్తున్న ప్రత్యేక పూజలు సోమవారం 15వ రోజుకి చేరాయి. అమ్మవారికి విశేషపూజ నిర్వహించారు. వేదమంత్రాలు, నాదస్వర సుస్వరాల మధ్య ఉదయం 8.10 గంటలకు శ్రావణలక్ష్మి పూజలు ప్రారంభించారు. పలువురు ఉభయదాతలు విశిష్ట పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాసుల రెడ్డి, ఏఈవో వెంపలి రాంబాబు, వేద పండితులు, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. కనకమహా లక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు.



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

అనుబంధాల వేడుక



రక్షాబంధన్ వేడుకల్లో..



వాసుపల్లికి రాఖీ కడుతున్న మహిళలు



ప్రేమసమాజంలో రాఖీ కడుతున్న స్వామి వివేకానంద సంస్థ మహిళలు, విద్యార్థులు



సోదరుడికి రాఖీ కడుతూ..

డాబాగార్డెన్స్/అల్లిపురం: అన్నాచెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల అనుబంధానికి, ప్రేమాప్యాయతలకు ప్రతీక రాఖీ పండుగను వాడవాడలా ఘనంగా జరుపుకున్నారు. అక్కా,చెల్లెళ్లు..అన్నదమ్ములకు రాఖీ కట్టి సోదరాభిమానం చాటుకున్నారు. నగరంలో ఎక్కడ చూసినా రాఖీ సందడి నెలకుంది. ప్రేమసమాజంలో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎందరో వృద్ధులకు రాఖీ కట్టి సోదర భావం చాటుకున్నారు. పిల్లలు కూడా రాఖీలు కట్టి సందడిగా గడిపారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా నియోజకవర్గంలో అన్నచెల్లెల్లు, అక్క తమ్ముళ్లతో ప్రతి ఇల్లూ సందడిగా మారాయి. చాలామంది సాయంత్రం వేళ రాఖీ వేడుకలు నిర్వహించారు.

వాసుపల్లి కార్యాలయంలో రక్షాబంధన్ వేడుకలు

డాబాగార్డెన్స్: విశాఖ దక్షిణ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ దక్షిన సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ కార్యాలయంలో సోమవారం రక్షాబంధన్ వేడుకలు ఘనంగా జరిగాయి. నియోజకవర్గ పార్టీ మహిళలు వాసుపల్లికి రాఖీ కట్టి స్వీట్స్ తినిపించారు. నియోజకవర్గానికే అన్నగా..అండగా నిలబడే వాసుపల్లి నిండు నూరేళ్ల ఆరోగ్యంతో ఉండాలని పలువురు అక్కా చెల్లెమ్మలు అభిలషించారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ తనకు రాఖీ కట్టిన అక్కా చెల్లెమ్మలు, మహిళలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. కార్పొరేటర్ తోట పద్మావతి, పార్టీ నాయకులు షబీరా బేగం తదితరులు వాసుపల్లికి రాఖీ కట్టారు.

ప్రేమసమాజం కుష్టు నివారణ కేంద్రంలో

ఏవీఎన్ కళాశాల సమీపాన గల ప్రేమసమాజం కుష్టు నివారణ కేంద్రంలో స్వామి వివేకానంద సంస్థ మహిళలు, ట్యూషన్ పిల్లలు రాఖీ సందడి చేశారు. కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న పలువురు వృద్ధులకు రాఖీ కట్టి మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు మాట్లాడుతూ ప్రతి ఏడాది రక్షాబంధన్ వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు.

చికిత్స పొందుతున్న సోదరుడికి..



మహారాణిపేట: కేజీహెచ్ రాజేంద్రప్రసాద్ ఐసీయూలో చికిత్స పొందుతున్న చీపురుపల్లి నాగేశ్వరరావుకు ఆమె అక్కచెల్లెళ్లు వరలక్ష్మి, పారిపిల్లి కొండమ్మ సోమవారం రాఖీ కట్టారు.

ఇసుకకొండకు పోటెత్తిన భక్తులు

డాబాగార్డెన్స్: నగరంలోని ఇసుకకొండ (బాబాజీకొండ)పై వెలసిన రమా సహిత సత్యనారాయణస్వామి ఆలయం సోమవారం భక్తులతో పోటెత్తింది. శ్రావణ పౌర్ణమి (రాఖీపౌర్ణమి) సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. జిల్లా నలుమూలల నుంచే గాక ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భక్తులు సత్యదేవుని ఆలయానికి పోటెత్తారు. వేకువజాము 4 గంటల నుంచే క్యూలైన్లు బారులు తీరాయి. అనివెట్టి మండపం వద్ద భక్తులు దీపాలు వెలిగించారు. సామూహిక వ్రతాలు అధిక సంఖ్యలో జరిగాయి. ఉచిత, రూ.20, రూ.200 దర్శనాలు ఏర్పాటు చేశారు. సామూహిక వ్రతాలు జరిగాయి. పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు, పలువురు ప్రముఖులు స్వామిని దర్శించుకున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆలయ కార్యనిర్వహణాధికారి రాజగోపాల్‌రెడ్డి చర్యలు చేపట్టారు. వన్‌టౌన్ పోలీసులు, వివిధ దేవాలయాల సిబ్బంది సేవలందించారు. మధ్యాహ్నం వరకు దర్శనాలు జరిగాయి. సాయంత్రం ఈలయ ప్రాంగణంలో మహిళలు పారాయణ నిర్వహించారు.

వైభవంగా సంతోషిమాత జన్మదినం

అల్లిపురం: శ్రావణ పౌర్ణమి సందర్భంగా చలువతోటలో వెలసిన శ్రీ సంతోషిమాత అమ్మవారి పుట్టిన రోజు వేడుకలు వైభవంగా నిర్వహించారు. తెల్లవారు జాము నుంచి అమ్మవారికి ఆలయ అర్చకుడు విశేష అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి విశేషంగా అలంకరించారు. అమ్మవారి సోదరుడు గణపతికి రాఖీ కట్టించిన వేడుక భక్తులకు కనువిందు చేసింది. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. భక్తుల గోత్రనామాలతో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఎరుకుమాంబకు ప్రత్యేక పూజలు

సీతమ్మధార: శ్రావణ పౌర్ణమి సందర్భంగా దొండపర్తిలో వెలసిన శ్రీఎరుకుమాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం గణపతి పూజ అనంతరం అమ్మవారికి పంచామృతాభిషేకం, పసుపు,గంధం, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. ముందుగా ఆలయ ఈవో జి.రమాబాయి అమ్మవారికి స్వహస్తాలతో 1008 కలశాలతో జలాభిషేకం నిర్వహించారు. అర్చకుడు శ్రీనివాస్ భక్తుల గోత్రనామాలతో విశేషపూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఈవో మాట్లాడుతూ ఈనెల 26వ తేదీన శ్రీకృష్ణాష్టమి సందర్భంగా సాయంత్రం 4గంటలకు దొండపర్తిలోని పలుప్రాంతాలలో ఊరేగింపు అనంతరం ఉట్టి సంబరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



రమా సహిత సత్యనారాయణ స్వామి

గాజుల అలంకరణలో నీలమ్మవేపచెట్టు అమ్మవారు

అల్లిపురం: అస్సాంగార్డెన్స్‌లో వెలసిన శ్రీ నీలమ్మవేపచెట్టు అమ్మవారు శ్రావణ పూర్ణిమ సందర్భంగా భక్తులకు గాజుల అలంకరణలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని సౌభాగ్యానికి ప్రతీకలు అయిన పసుపు కొమ్ములు, గాజులు, ఎర్రటి మందార పువ్వులతో ఆలయ అర్చకుడు జోగారావు శర్మ విశేషంగా అలంకరించారు. పంచపౌర్ణమిల్లో భాగంగా అమ్మవారికి శ్రావణ పౌర్ణమి సందర్భంగా విశేష అభిషేకాలు చేపట్టిన అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహం, మూలవిరాట్టులను పసుపు కొమ్ములతో, మందార పూలతో విశేషంగా అలంకరించారు. ఆలయ కార్యనిర్వహణాధికారిణి కె.రమాబాయి పాల్గొన్నారు.

మహారాణిపేట: మెయిన్ రోడులో ఉన్న శ్రీ ఆంజనేయస్వామి వారి దేవాలయంలో శ్రావణ పౌర్ణమి పురస్కరించుకొని సోమవారం మన్యుసూక్త హోమం ఘనంగా నిర్వహించారు.



విశేష అలంకరణలో సంతోషిమాత అమ్మవారు, వినాయకుడు



గాజులు, పసుపు కొమ్ముల అలంకరణలో నీలమ్మవేపచెట్టు అమ్మవారు

31న మహిళా న్యాయవాదులకు వర్క్ షాప్

సీతంపేట: మహిళా న్యాయవాదులకు ఈ నెల 31న వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో వర్క్ షాప్ నిర్వహించనున్నట్లు మహిళా న్యాయవాదుల వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పప్పు అనూరాధ, పి.హేమమాలిని తెలిపారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో సోమవారం విలేకరులతో వారు మాట్లాడారు. వర్క్ షాప్‌నకు ముఖ్య అతిథిగా ఏపీ హైకోర్టు న్యాయమూర్తి వి.ఎస్.భానుమతి, గౌరవ అతిథిగా తెలంగాణ హైకోర్టు జడ్జి ప్రియదర్శిని, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి, విశాఖ జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి రవినాథ్, విశాఖ బార్ అసోసియేషన్ ప్రముఖులు హాజరుకానున్నారని తెలిపారు. కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచారాన్ని నిరసిస్తూ మంగళవారం ఉదయం 11 గంటలకు జిల్లా కోర్టు నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు నిరసన ర్యాలీ చేపడుతున్నట్లు తెలిపారు.

ఉత్పత్తుల్లో నాణ్యతకు ప్రాధాన్యం

మురళీనగర్: పరిశ్రమలు అందించే ఉత్పత్తుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఉందని ఆంధ్రా యూనివర్సిటీ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం సీనియర్ ప్రొఫెసర్. విజయనగరం జేఎన్‌టీయూ పూర్వ వైస్ చాన్సలర్ డాక్టర్ కె. వెంకట సుబ్బయ్య అన్నారు. ఏఐసీటీ ఆధ్వర్యంలో కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో జాతీయ స్థాయిలో 'నాణ్యత నిర్వహణ'పై ఫ్యాకల్టీ డెవలప్‌మెంటు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ పాలిటెక్నిక్ కాలేజీల్లో పనిచేస్తున్న మెకానికల్ విభాగం అధ్యాపకులు కంపెనీ ఉత్పత్తులకు సంబంధించిన నాణ్యత పరిశీలన లాజిస్టిక్ మేనేజిమెంటుపై పూర్తి అవగాహన ఉండాలని చెప్పారు. గెయిల్ ఇండియా జనరల్ మేనేజర్ రామకృష్ణ పుట్ల మాట్లాడుతూ రానున్న కాలంలో ప్రతి ఇంజనీర్‌కి వివిధ ఉత్పత్తి రంగాల్లో నాణ్యత నిర్వహణ తప్పనిసరిగా తెలిసి ఉండాలన్నారు. ఎఫ్‌డీపీ కోఆర్డినేటరు, కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు మాట్లాడుతూ ఈ శిక్షణ తరగతులు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి బ్యాచ్‌లో 50 మందికి వారం రోజుల పాటు శిక్షణనిస్తామన్నారు. కార్యక్రమంలో విశాఖ స్టీల్ ప్లాంట్ ఏజీఎం బి.విజయకుమార్, కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇన్‌స్టిట్యూట్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ, పెందుర్తి వోఎస్‌డీ డాక్టర్ ఎన్.చంద్రశేఖర్, మెకానికల్ హెడ్ కె.మధుకుమార్, 50 మంది మెకానికల్ ఇంజినీరింగ్ అధ్యాపకులు పాల్గొన్నారు.